

కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభిస్తున్న శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

**శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి**
**ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌లో**
**కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభించిన డీసీపీ**

ఆమనగల్లు, డిసెంబర్ 12 : శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని శంషాబాద్ జోన్ డీసీపీ నారాయణ రెడ్డి అన్నారు. అంకితభావంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు ఎల్లవేళలా సేవలు అందించడానికి పోలీసు అధికారులు సిద్ధంగా ఉండాలని డీసీపీ పేర్కొన్నారు. ఆమనగల్లు పోలీస్‌స్టేషన్ కార్యాలయాన్ని మంగళవారం షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమనగల్లు ఎస్‌ఐ బలరాం ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది డీసీపీ నారాయణరెడ్డికి గౌరవ వందనం చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించి పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డులను డీసీపీ పరిశీలించారు. అనంతరం డీసీపీ నారాయణరెడ్డి పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఆమనగల్లు సర్కిల్ పరిధిలో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజాప్రతినిధులు, ప్రజలందరూ సహకరించారని ఆయన తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అదుపునకు పోలీసుశాఖ చేపడుతున్న చర్యలకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ బలరాం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## క్రైస్తవుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 12 : క్రిస్మస్ పండుగ సందర్భంగా నిర్వహించనున్న క్రిస్మస్ సంబురాల్లో భాగంగా వివిధ రంగాల్లో సామాజికరంగం, విద్యా, వైద్య, సాహిత్య, క్రీడా రంగాల్లో ఉత్తమ సేవ, ప్రతిభావంతులైన క్రైస్తవ వ్యక్తులు, సంస్థలను తెలంగాణ ప్రభుత్వం సత్కరించనున్నది. తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు ఈ రంగాల్లో కనీసం 5 సంవత్సరాలు అంతకంటే ఎక్కువకాలం పాటు ఆదర్శప్రాయమైన సేవలను అందించిన ప్రముఖ క్రైస్తవ వ్యక్తులు, సంస్థల నుంచి నామినేషన్లు ఆహ్వానిస్తోంది. ఈనెల 15 సాయంత్రం 5గంటల వరకు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి 2వ అంతస్తు, సమీకృత కలెక్టర్‌రేట్ కాంప్లెక్స్ కొంగర కలాన్‌లో సమర్పించాలని తెలిపారు. నామినేషన్ ఫామ్‌లు WWW.TSCMFC.IN నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం 040-23391067నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# యాసంగికి సిద్ధం

- కూరగాయల సాగుకు.. రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ ప్రణాళిక
- 9,195 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు అయ్యేలా చర్యలు
- హైదరాబాద్‌లోని పలు మార్కెట్లకు జిల్లా నుంచే కూరగాయల ఎగుమతి
- యాసంగిలో కూరగాయలను సాగు చేస్తేనే ప్రయోజనం ఉంటుందంటున్న అధికారులు



రంగారెడ్డి, డిసెంబరు 12 (నమస్తే తెలంగాణ): 'రంగారెడ్డి జిల్లాలో యాసంగి సాగుకు ఉద్యానవన శాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. 9,195 ఎకరాల్లో రైతులు కూరగాయల సాగును చేపట్టేలా అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. కూరగాయల సాగులో రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్‌లోని పలు మార్కెట్లకు సైతం జిల్లా నుంచే కూరగాయలు ఎగుమతి అవుతున్నాయి. కొన్నేండ్లుగా జిల్లాలో క్రమక్రమంగా కూరగాయల సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తున్నది. ఈ పరిస్థితుల్లో జిల్లా గత వైభవాన్ని చాటుకునేలా ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. శిక్షణా కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు కూరగాయల సాగులో రైతులకు మెలకువలను సైతం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.'

**కూరగాయల సాగే జీవనాధారం..**

జిల్లాలోని అనేక పల్లెలు కూరగాయల సాగుకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. అనేక దశాబ్దాలుగా రైతు కుటుంబాలు కూరగాయల సాగునే జీవనాధారం చేసుకుని బతుకుతున్నాయి. చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ తదితర ప్రాంతాలు క్యారెట్ సాగుకు పేరుగాంచాయి. అలాగే ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, బాలాపూర్ ప్రాంతాలు ఆకుకూరలకు, షాద్‌నగర్ పచ్చిమిర్చి సాగుకు ప్రఖ్యాతిగాంచాయి. జిల్లావ్యాప్తంగా సాగు చేస్తున్న కూరగాయల సాగుతో ప్రతియేటా 3లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయల ఉత్పత్తి జరుగుతున్నది. వీటిలో 30 శాతం జిల్లా అవసరాలకు పోగా.. మిగతా 70శాతం కూరగాయలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతోపాటు, హైదరాబాద్ మహానగరంతోపాటు చుట్టూరా ఉన్న ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. పాలకూర, చుక్కకూర, పొన్నగంటి కూర, మెంతికూర, ఎర్ర గోంగూర వంటి అనేక రకర కాల ఆకు కూరలతోపాటు కూరగాయలను పండిస్తూ జిల్లా రైతాంగం ఆర్థిక ప్రగతిని సాధిస్తున్నది.


హైదరాబాద్‌కు చెంతనే ఉన్న రంగారెడ్డి జిల్లా గత పదేండ్లకాలంలో నలు వైపులా శరవేగంగా విస్తరిస్తుండడం కూరగాయల సాగుపై ప్రభావం పడింది. పెద్ద ఎత్తున పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటవుతుండడం.. వ్యవసాయ భూములు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతుండడంతో కూరగాయల సాగు క్రమక్రమంగా తగ్గుతూ వస్తున్నది. ఈ పరిస్థితుల్లో కూరగాయల సాగును ప్రోత్సహించి గత వైభవాన్ని జిల్లా చాటేలా ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**కాలం ఏదైనా.. ఫుల్ డిమాండ్**

ఏ కాలం అయినా..కూరగాయల కొరత మాత్రం సర్వసాధారణమైంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ కూరగాయ పండించినా ఫుల్ డిమాండ్ ఉంటున్నది. ఇక వచ్చేది వేసవి కాలం. కూరగాయలు దొరకడం మరీ కష్టం. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత యాసంగిలో జిల్లా రైతాంగం కూరగాయల పంటలనే సాగు చేయాలని ఉద్యానవన శాఖ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ రకం కూరగాయ అయినా కిలో కనీసం రూ.60 ధర పలుకుతున్నది. ఇతర పంటలతో పోలిస్తే కూరగాయల సాగుతో మూడింతల లాభాన్ని రైతులు పొందవచ్చు. గతంలో సరైన నీటి వనరులు లేక రైతులు కూరగాయల సాగుకు ముందుకు వచ్చే పరిస్థితి ఉండేది కాదు. ఇప్పుడా ఇబ్బంది లేదు. పుష్కలమైన సాగునీరు అందుబాటులో ఉన్నది. కూరగాయలను విక్రయించుకునేందుకు రవాణా వ్యవస్థ సైతం మెరుగుపడింది. ఒక ఎకరం వరి సాగుకు ఉపయోగించే నీటితో 4 ఎకరాల్లో కూరగాయలను సాగు చేయొచ్చని అధికారులు పేర్కొంటున్నారు. వచ్చేది వేసవి కాలం కావడంతో మంచి ధర పలికే అవకాశం ఉన్నందున యాసంగిలో అధిక విస్తీర్ణంలో కూరగాయలు, ఆకు కూరలను సాగు చేయాలని అధికారులు కోరుతున్నారు.

**యాసంగి ప్రణాళిక ఇలా..**

| పంట | సాగు విస్తీర్ణం (ఎకరాల్లో) |
|---|---|
| టమాట | 2,775 |
| ఉల్లిగడ్డ | 51 |
| పచ్చిమిర్చి | 576 |
| బెండ | 421 |
| వంకాయ | 608 |
| బీన్స్ | 488 |
| పొట్లకాయ | 472 |
| ఆకు కూరలు | 1,127 |
| క్యారెట్ | 1,272 |
| క్యాబేజీ | 259 |
| కాలిఫ్లవర్ | 257 |
| ఇతర కూరగాయలు | 889 |




**సర్కారు ప్రోత్సాహం..**

ఉద్యాన పంటల సాగుకు రాయితీ పథకాలతో ప్రభుత్వం ఇతోధికంగా ప్రోత్సాహం అందిస్తోంది. 2014 నుంచి 2022-23 సంవత్సరం వరకు జిల్లాలో సాగు చేసిన పండ్ల తోటలు, కూరగాయల సాగుకు రూ.2.08కోట్లు, నీటి కుంటల నిర్మాణానికి రూ.1.69కోట్లు, మల్చింగ్‌కు రూ.28లక్షలు, శీతల గదుల కోసం రూ.8.08కోట్ల రాయితీ పథకాలను రైతులకు ప్రభుత్వం అందించింది. బిందు సేద్యాన్ని ప్రోత్సహించేందుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీ రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం చొప్పున ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. గత పదేళ్లకాలంలో బిందు సేద్యం ద్వారా రూ.73కోట్లు, తుంపర సేద్యం ద్వారా రూ.56లక్షల రాయితీతో రైతులు లబ్ధిపొందారు. 199 ఎకరాల్లో పాలీ హౌస్‌లను, 5 ఎకరాల్లో నెట్‌హౌస్‌లను ఏర్పాటు చేసింది. ఇందుకు గాను రూ.69.93కోట్లను వెచ్చించగా, 220 మంది రైతులు లబ్ధిపొందారు. జిల్లాలో 162 ఎకరాల్లో మల్బరీ సాగు అవుతుండగా..రేరింగ్ షెడ్డు నిర్మాణానికి గతంలో ఇచ్చిన రూ.లక్షను తెలంగాణ ప్రభుత్వం రూ.2లక్షలకు పెంచింది. జిల్లాలో ఇప్పటివరకు 90 రేరింగ్ షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది.

## బోధనోపకరణాలను తప్పక వినియోగించాలి

**డీఈవో రేణుకాదేవి**

బొంరాస్‌పేట, డిసెంబర్ 12 : తరగతి గదిలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించే సమయంలో బోధనోపకరణాలను తప్పక వినియోగించాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి అన్నారు. మంగళవారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో డీఈవో పర్యటించి పాఠశాలలను సందర్శించారు. బొంరాస్‌పేట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించి సమావేశాల తీరును పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు అమలు తీరును ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. తొలిమెట్టును పకడ్బందీగా అమలు చేయాలని, విద్యార్థులకు కనీస సామర్థ్యాలు రావాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షల సన్నద్ధతపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు అందించారు. ప్రత్యేక తరగతులు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు తేవాలని సూచించారు. ఉపాధ్యాయులు పాఠ్యప్రణాళిక తయారు చేసుకుని పాఠాలు బోధించాలని అన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి రోజూ భోజనం, అల్పాహారం పెడుతున్నారా అని డీఈవో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దుద్యాల మండలంలోని చిల్‌ముల్‌మైలారం యూపీఎస్‌ను డీఈవో రేణుకాదేవి సందర్శించారు. పాఠ్యాంశాలపై విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో రాంరెడ్డి, ఉన్నత పాఠశాల హెచ్ఎం హరిలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిల్‌ముల్‌మైలారం యూపీఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

## మౌలిక వసతుల కల్పనకు కృషి

**సెర్చ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో**
**త్వరలో దవాఖాన అభివృద్ధి**
**జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్**

షాబాద్, డిసెంబర్ 12: షాబాద్ ప్రభుత్వ దవాఖానలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ తెలిపారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. అనంతరం సెర్చ్ ఆర్గనైజేషన్ సభ్యులతో కలిసి దవాఖాన ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే సెర్చ్ ఆర్గనైజేషన్ సహకారంతో చందనవెళ్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. షాబాద్ దవాఖానను కూడా త్వరలోనే సెర్చ్ ఆర్గనైజేషన్ వారి సహకారంతో అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. షాబాద్ దవాఖాన ఆవరణ, భవనం పూర్తిగా శిథిలావస్థలో ఉందని, త్వరలో పనులు ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి ఆదేశానుసారం సెర్చ్ ఆర్గనైజేషన్ సభ్యులతో కలిసి దవాఖానను సందర్శించడం జరిగిందన్నారు. ఆయన వెంట సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, సెర్చ్ ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులున్నారు.



షాబాద్ ప్రభుత్వ దవాఖాన ఆవరణాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి